క్లుప్తంగా

తడి-పొడి విధానంతో మేలు


ఎస్ మాధవరావు, తూ.గో జిల్లా వ్యవసాయాధికారి

దేవరపల్లి: తడి,పొడి వ్యవసాయ విధానంతో వరి సాగులో నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. (ఏడబ్ల్యూడీ) పద్ధతిలో వరి వ్యవసాయం ప్రయోజనాలు, నీటి పొదుపు, భూసారం మెరుగుదల, పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాలపై అధికారులు చర్చించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు శనివారం ఆయన తెలిపారు. ఈ నూతన విధానంతో రైతులు పండించిన పంట దిగుబడిలో ఎటువంటి హానీ లేకుండానే నీటిని 25 నుంచి 30 శాతం ఆదా చేయవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఖర్చు తగ్గించి, దిగుబడిని పెంచుకుంటు సాగు చేసే శాస్త్రీయ విధానమన్నారు. దీన్ని అమలు చేస్తే రైతులు నష్టాలను తగ్గించుకుని లాభాల్లోకి రావచ్చని సూచించారు. ప్రతి హెక్టారుకు 30 శాతం నీటిని పొదుపు చేయడంతో పాటు భూమి గుణ నిల్వలో కూడా మంచి మార్పులు వస్తున్నట్టు ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నట్టు ఆయన వివరించారు.

చేయూత అందించడమే ప్రభుత్వ లక్ష్యం


సమిశ్రగూడెంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: పేదలకు ఆర్థిక, సామాజిక బాధ్యతలో భాగంగా చేయూతను అందించమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, పీ4 కార్యక్రమాలపై నియోజకవర్గస్థాయి అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో 10 శాతం మార్గదర్శులను, దిగువస్థాయిలో 20 శాతం బంగారు కుటుంబాలను ఎంచుకుని పీ4 ఉద్దేశ్యం వివరించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్, అంటువ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎ. దుర్గేష్, ఎంపీడీఓ జగన్నాథరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతులతోనే విగ్రహాలు ఏర్పాటు చేయాలి


పోలీస్ స్టేషన్‌లో వేళ్లచింతలగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

గోపాలపురం: ప్రభుత్వ అనుమతులు లేకుండా నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయరాదని దేవరపల్లి సీఐ బి.నాగేశ్వర్ నాయక్ అన్నారు. శుక్రవారం గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెంలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహ, స్థూపం ఏర్పాటుపై చెలరేగిన వివాదంపై శనివారం గ్రామస్తులతో చర్చలు జరిపారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని గ్రామంలో అన్నదమ్ముల్లా కలసి ఉండాలని, ప్రభుత్వ అనుమతులతోనే విగ్రహాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో శాంతిభద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా వేళ్లచింతలగూడెం గ్రామంలో పోలీస్ పికెటింగ్‌తో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిడదవోలు: మండలంలోని సుమారు 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి శనివారం కొవ్వూరు–పశివేదల రైల్వేస్టేషన్ల మధ్య మృతదేహన్ని గుర్తించినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మరణించినట్లు రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడు బిస్కెట్ కలర్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు, పారగాన్ చెప్పులతో ఉన్నాడని పేర్కొన్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి మృతదేహన్ని తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలు తెలిసిన వారు 94906 17090, 99480 10061 నంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్సై కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెరవలి: మండలంలోని ఖండవల్లి గ్రామంలోని భక్తాంజనేయస్వామి ఆలయం సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ మేరకు పెరవలి ఎస్సై యం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేకాట ఆడుతున్నారని సమాచారం రావటంతో సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఐదుగురు జూదరులని అదుపులోకి తిసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,020 నగదును సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు.

కూటమి ఆర్థిక విధ్వంసం

- కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- ఏడాది పాలనలో అక్రమ కేసుల బనాయింపు
- సూపర్ సిక్స్‌ని గాలికి వదిలేసిన వైనం


సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల కృష్ణ, వేదికపై మాజీ హోంమంత్రి వనిత, యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్లమెంట్ల పరిశీలకులు గురుమూర్తి, చందన నాగేశ్వర్


బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

దేవరపల్లి: కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి గ్రామ స్థాయిలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి చర్చ జరిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ఆర్ కన్వెన్షన్ హాలులో శనివారం మాజీ హోం మంత్రి, నియోజకవర్గ పరిశీలకులు తానేటి వనిత అధ్యక్షతన జరిగిన బాబూ ష్యూరిటీ మోసం గ్యారెంటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజలకు వివరించాలి..

చెల్లుబోయిన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను త్రికరణ సుద్ధితో అమలు చేస్తామని చెప్పారని ఆయన గుర్తుచేశారు. కూటమిలో ఇసుక, మట్టి, మద్యం, గంజాయి మాఫీయా తయారైయిందని దుయ్యాబట్టారు. అధికార పక్షాన్ని, ప్రతిపక్షం మేల్కొలపాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో పేదరికం ఉండకూడదనే ఆలోచనతో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. దివంగత వైఎస్. రాజశేఖరరెడ్డి ఆశయాల కోసం పుట్టిందే వైఎస్సార్ సీపీ అని ఆయన తెలిపారు. అధికార పక్షం ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ఉచిత విద్యుత్, ఆరోగ శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను వైఎస్సార్ ప్రవేశపెట్టి అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. 2029 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్.జగన్‌ను సీఎం చేసే వరకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అన్ని వర్గాలకూ దగా

మాజీ హోం మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మోసం, దగాచేసి ప్రజలను ఇబ్బంది పెడుతుందని ఆమె ఆరోపించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తుందని ఆమె విమర్శించారు. బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారంటీ పేరుతో ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు బాండ్లు ఇచ్చారని, అవి ఏమైపోయాయని ఆమె ప్రశ్నించారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అప్పటి వరకు పరిపాలన చేసిన టీడీపీ రూ.100 కోట్లు ఖజానాలో నిల్వ ఉంచగా, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన వైఎస్. జగనన్న 2019 ఎన్నికల అనంతరం ప్రభుత్వ ఖజానాలో 7 వేల కోట్లు నిల్వ ఉంచారని ఆమె గుర్తు చేశారు. ఐదేళ్ల పరిపాలనలో రూ.3 లక్షల కోట్లు అప్పు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2.60 లక్షల కోట్లు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించినట్టు ఆమె తెలిపారు. 43 లక్షల మంది తల్లులకు అమ్మఒడి పథకం అందించగా, కూటమి ప్రభుత్వం 87 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వవలసి ఉండగా, కేవలం 54 లక్షల మందికే అందించినట్టు ఆమె గుర్తు చేశారు. కోకో, పామాయిలు, మామిడి, ధాన్యం, పొగాకు పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలు, దగా, వెన్నుపోటును ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

జగన్ పర్యటనలతో వణుకు

రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావలసిన బాధ్యత ప్రతిపక్షంగా మనపై భాధ్యత ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పరిపాలనలో రూ.67,500 కోట్లు రైతులకు రైతు భరోసా అందించినట్టు ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ పేరుతో ఊరూ వాడా కూటమి ప్రభుత్వం ఊదరగొట్టిందన్నారు. ఏడాది పాలనలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. జగనన్న కార్యక్రమాలు పెడితే కూటమి ప్రభుత్వం వెన్నులో వణుకు పుడుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తండోపతండాలుగా కార్యక్రమాలకు వస్తున్నారని ఆయన చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరణ

అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిశీలకులు గురుమూర్తి, రాజమహేంద్రవరం పట్టణ కో–ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలి వేణు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శులు నరహరిశెట్టి రాజేంద్రబాబు, గడా రాంబాబు, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. గంగరాజు, ఇళ్ల భాస్కరారావు మాట్లాడారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, వెలగా శ్రీరామూర్తి, వెల్లంకి సుబ్రహమణ్యం, ప్రతాపనేని వాసుబాబు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ విభాగ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు రూ.27.77 లక్షల ఆదాయం


కోటసత్తెమ్మ ఆలయంలో హుండీల నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయ హుండీలను శనివారం సిబ్బంది లెక్కించారు. 100 రోజులకు సంబంధించిన అమ్మవారి హుండీల ఆదాయాన్ని జిల్లా దేవదాయశాఖ అధికారి ఐవీ సుబ్బారావు పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది నగదును లెక్కించారు. ఈ మేరకు హుండీల ద్వారా రూ.26,08,512 నగదు, అన్నదాన ట్రస్ట్ ద్వారా రూ.1,69,143 కలిపి వెరసీ మొత్తం రూ.27,77,655 నగదు, 26 గ్రాముల బంగారం, 296 గ్రాముల వెండి ఆదాయం సమకురినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ వి.హరిసూర్యప్రకాష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ


నూతన ఎస్సై డి.రవికుమార్

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల నూతన ఎస్సైగా డి.రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎస్సై గుబ్బల శ్రీనివాసు సీఐడీకి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అంగర నుంచి బదిలీపై వచ్చిన రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ మేరకు ఏఎస్సై, సిబ్బంది స్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం


పార్టీ నూతన గ్రామకమిటీతో వెలగా శ్రీరామమూర్తి, నాయకులు

గోపాలపురం: మండల పరిధిలోని ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తునట్లు మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి పేర్కొన్నారు. అందులో భాగంగా శనివారం సంజీవపురం వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తెలిపారు. రాష్ట్ర మాజీ హోంమంత్రి, పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత ఆధ్వర్యంలో పార్టీలో చురుగ్గా పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపునిస్తున్నారని కొనియాడారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోకనాటి ఫణిరాజు, ఉపాధ్యక్షుడు కాట్నం రామకృష్ణ, కార్యదర్శిగా సొంగా లక్ష్మణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్ కేబుల్ నిలిపివేస్తాం: సంజీవపురంలో నిర్వహిస్తున్న ఏపీ ఫైబర్ ద్వారా సాక్షి టెలివిజన్ ప్రచారం చేయకపోతే కేబుల్ నిలుపుదల చేస్తామని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు తీర్మాణం చేశారు. ఈ మేరకు కేబుల్ టీవీ ఆపరేటర్లను ఉద్దేశిస్తూ ఎవరికి వారు ప్రైవేట్ డిష్‌లు ఏర్పాటు చేసుకొని గ్రామంలో ఏపీ ఫైబర్ నెట్ లేకుండా చేస్తామని హెచ్చరించారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి రూ. కోటి విరాళం


కలెక్టర్‌కు అంగీకార పత్రాన్ని అందచేస్తున్న బయోటెక్ ఎంపీ ఆనంద్, ఎమ్మెల్యే

దేవరపల్లి: దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నూతన భవన నిర్మానానికి పరమేశు బయోటెక్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం ముందుకు వచ్చింది. రూ. కోటి వ్యయంతో అన్ని వసతులతో కూడిన నూతన భవనాన్ని నిర్మించి అందజేయనున్నట్టు పరిశ్రమ ఎండీ ఆనంద్ స్వరూప్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుతో కలిసి ఆనంద్ స్వరూప్ కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం భవనం శిధిలావస్థకు చేరుకోవడంతో దేవరపల్లిలోని పరమేశు బయోటెక్ లిమిటెడ్ పరిశ్రమ సామాజిక బాధ్యత కింద భవన నిర్మాణానికి పరిశ్రమ సీఎస్ఆర్ నిధులు రూ.కోటి వ్యయంతో భవన నిర్మాణం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు నిర్మాణానికి ఎటువంటి అభ్యంతరం లేదని, ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు త్వరలో మంజూరు చేస్తామని కలెక్టర్ ఎండీకి తెలిపారు.

దేశ నిర్మాణంలో మున్సిపాలిటీల పాత్ర కీలకం


పలువురు మున్సిపల్ చైర్మన్‌లతో ఆదినారాయణ

నిడదవోలు: హర్యానా రాష్ట్రంలోని గురుగ్రామ్‌లో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించిన మున్సిపల్ చైర్మన్ల జాతీయ స్థాయి సదస్సుకు నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ హాజరయ్యారు. రాజ్యాంగ ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో పట్టణ స్థానిక సంస్థల పాత్రపై నిర్వహించిన రాష్ట్రంలో 123 నగరపాలక, పురపాలక నగర పంచాయతీల నుంచి 25 మంది మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్లను ప్రభుత్వం ఎంపిక చేశారు. వీరిలో నిడదవోలు మున్సిపల్ చైర్మన్ కూడ ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సులో పాల్గొనడంతో పురపాలక సంఘాల అభివృద్ధి, ప్రజాస్వామ్య పాలన వంటి ఎన్నో అంశాలపై అవగాహన పెరిగిందన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య పాలనతో పాటు దేశ నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో పురపాలిక సంఘాల పాత్ర ఎంతో ప్రాముఖ్యత ఉందని దానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తానని ఆయన వివరించారు.

లోక్ అదాలత్‌లో 551 కేసుల పరిష్కారం


కొవ్వూరు కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న న్యాయవాదులు

నిడదవోలు: కక్షిదారులు లోక్ అదాలత్ ప్రత్యేక కోర్టును వినియోగించుకుని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకోవడంతో తమ విలువైన సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కె.రెహమాన్ అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం మెగా లోక్ అతాలత్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కోర్టు, బెంచ్ కోర్టులలో పలు రకాల 551 కేసులను పరిష్కరించారు. ప్రధానంగా క్రిమినల్ కేసులు 48, ఎక్సైజ్ కేసులు 63, ఎన్ఐ కేసులు 02, మనోవర్తి కేసులు 04, సివిల్ కేసులు 08, విడాకుల కేసు 01, పెట్టీ కేసులు 24 ఉన్నాయి. ఈ కార్యక్రమంలో బెంచ్ కోర్టు జడ్జి నక్క అజయ్‌కుమార్, లోక్ అదాలత్ సభ్యులు నందిగం సుబ్బారావు, మెంటే వెంకటేశ్వరరావు, పోలీస్ అధికారులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కొవ్వూరులో 213 కేసులు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు కోర్టు ప్రాగణంలో శనివారం మండల న్యాయ సేవ సంస్థల అధ్వర్యంలో పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కారం నిమిత్తం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రీ లిటిగేషన్, సివిల్, క్రిమినల్, సివిల్ క్రిమినల్ కేసుల పరిష్కారం నిమిత్తం మొత్తం 4 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు సివిల్ కేసులు 68, క్రిమినల్ కేసులు 72, ఎక్సైజ్ కేసులు 73, మొత్తం 213 కేసులు రాజీ చేసినట్టు న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ న్యాయవాదులు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులపై 16 కేసులు


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ కేవీ శివప్రసాద్

చాగల్లు: మండలంలోని వివిధ స్కూల్, కళాశాలల బస్సులను శనివారం కొవ్వూరు ఎంవీఐ కేవీ శివప్రసాద్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. చాగల్లులోని కొవ్వూరు–దేవరపల్లి రోడ్డులో గామన్ బ్రిడ్జి ఫ్లైఓవర్ వద్ద తనిఖీలు చేపట్టారు. బస్సుల్లో అటెండెట్, అగ్నిమాపక యంత్రాలు, ఫైర్ అలారం, లైసెన్స్‌లు లేకపోవడం వంటి కారణాలతో 16 కేసులు నమోదు చేసినట్లు శివప్రసాద్ తెలిపారు. సదరు కేసుల్లో మొత్తం రూ. 1,68,300 అపరాధ రుసుము విధించామన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ వి.లక్ష్మీ ప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ లే అవుట్‌లపై నిరంతర పర్యవేక్షణ


కొవ్వూరులో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

తాళ్లపూడి(కొవ్వూరు): హౌసింగ్ లే అవుట్‌లలో అంతర్గత రహదారులకు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు తెలిపారు. గృహ నిర్మాణాల పనులను పూర్తి చెయ్యడంలో క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ చేయాలని కొవ్వూరు మండలం పరిధిలోని స్పేక్ ఫేజ్ 2 లేఅవుట్‌ను శనివారం అధికారులతో కలిసి జేసీ పరిశీలించారు. ప్రతి శనివారం హౌసింగ్ డే సందర్భంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని, అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాల పనులను పూర్తి చెయ్యడంలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన పెంచాలన్నారు. గృహనిర్మాణ కోసం ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సహాయంతో స్టేజి కన్వర్షన్ విధానంలో దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శేఖర్ బాబు, తహసిల్దార్ దుర్గాప్రసాద్, హౌసింగ్ ఏఈ చక్రవర్తి, మున్సిపల్ ఏఈ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం


కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని ధర్మవరం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి కరెంట్ షాక్‌తో మృతిచెందిన విద్యార్థి జొన్నకూటి సౌమ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఈ మేరకు సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా త్వరితగతిన అందేలాచేస్తానని తెలిపారు. గ్రామంలో కరెంటు స్తంభాలు సరిచేయాలని విద్యుత్ శాఖ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం శివారు లారీస్టాండ్ వద్ద శనివారం పేకాటాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎల్.బాలాజీసుందరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామశివారులోని లారీస్టాండ్ వద్ద పేకాటాడుతుండగా ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.2,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డ్రమ్‌సీడర్‌తో భలేసాగు


ముక్కామలలో డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేస్తున్న రైతులు

పెరవలి: ఖరీఫ్ నాట్లు ఆలస్యంతో నాట్లు వేయని రైతులు డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసుకుంటే సాధరణ పంటకంటే 15 రోజులు ముందుగానే పంట చేతికందుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఎగ్జక్యూటివ్ రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ముక్కామల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో శనివారం డ్రమ్ సీడర్‌తో విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో ఖర్చులు తగ్గించి దిగుబడులు సాధించాలంటే ఆధునిక విజ్ఞానాన్ని వినియోగించుకుని సాగుచేస్తే లాభాల బాట పట్టవచ్చని సూచించారు. డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేయడంతో ఆకుమడి ఖర్చులతో పాటు వరినాట్లు వేసే పరిస్థితి ఉండదని దీనివలన పంట 15 రోజులు ముందుగా వస్తుందని, ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో ఎకరానికి 10 కిలోల విత్తనాలు వేస్తే సరిపోతుందని ఇందులో 8 కిలోల వరి విత్తనాలు, రెండు కిలోలు నాలుగు రకాలైన పప్పు దినుసు విత్తనాలు వేస్తామని భూమిలో నత్రజని చేరి పంటకు బలం చేకూరి మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఈ పప్పు దినుసులతో తెగుళ్ల వ్యాప్తి ఉండదన్నారు. మండలంలో 300 ఎకరాల్లో సాగు చేయటానికి రైతులు ముందుకు వచ్చారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉమా మహేశ్వరరావు, సూర్యనారాయణ, ముత్యాలు, ప్రశాంతి, వెంకటకృష్ణ, జ్యోతి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

వైద్య విద్యపై కూటమి కుట్రలు


సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి విభాగం అధ్యక్షుడు చంద్రబాబు

నిడదవోలు: మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పట్టణ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను ప్రారంభించారన్నారు. కూటమి అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే పెత్తందారీ వ్యవస్థకు కొమ్ముకాసే విధంగా, వైద్య విద్యను పేదవారికి అందకుండా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ నిర్ణయాలను వ్యతిరేకించిన వైద్య విద్యార్థులపై దాడులు చేయడం అమానుషమైన చర్యగ పరిగణిస్తూ జరిగిన తీరుకు నిరసనగా రాష్ట్ర వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య అధ్యక్షతన ఈనెల 7 వతేదిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు వినతి పత్రం సమర్పించడానికి పార్టీ అధినాయకత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి బుద్ధి వచ్చే విధంగా ఈ నిరసన కార్యాక్రమానికి రాష్ట్ర నలుమూల నుంచి పార్టీ విద్యార్థి విభాగం నాయకులు, అభిమానులు ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నాగేంద్ర, రవి, చిన్న, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని క్లోరినేషన్ చేయాలి

ఉండ్రాజవరం: మండలంలో తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో వి.రామారావు సూచించారు. మండలంలో తాడిపర్రు గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాను శనివారం ఆయన పరిశీలించారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. రక్షిత మంచి నీటి ట్యాంక్ చూట్టు పక్కల బ్లీచింగ్ చల్లాలని, శానిటేషన్ చేయాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులు దరిచేరవన్నారు.